క్లుప్తంగా

పుస్తకాల వితరణ



ప్రధానోపాధ్యాయుడికి పుస్తకాలు అందజేస్తున్న దాతలు

సంతకవిటి: మండలంలోని మందరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి ఎన్‌ఆర్‌ఐలు లెంక జగన్, లెంక శైలజ, లెంక సోమార్క్ ఆదివారం పుస్తకాలు వితరణ చేశారు. దాదాపు రూ.10 వేల విలువైన ఇంగ్లిష్ మీడియం పుస్తకాలను దాతలు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు దాసరి కృష్ణారావు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ అదపాక దామోదరరావు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు, సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఇ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న విశ్రాంత ఎంఈఓ సత్యనారాయణ

తెర్లాం: ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఎం.సత్యనారాయణ, లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, దేశ నాయకుల చరిత్ర వివరించడం వంటివి చేయించారు.

రైతు ఉత్పత్తి సంఘాల సంఖ్య పెరగాలి



రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుపై చర్చిస్తున్న అధికారులు

రాజాం: రైతు ఉత్పత్తి సంఘాల సంఖ్య పెరగాలని, ప్రతీ మహిళా రైతు ఈ సంఘాల్లో చేరి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలని ఎఫ్‌పీఓ ఏపీఎం కె.హేమలత అన్నారు. ఆదివారం మండలంలోని బొద్దాం గ్రామంలో మహిళా సంఘాల సభ్యలకు రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లో వీటి సంఖ్య పెరుగుతోందని, బొద్దాంలో కూడా ఎక్కువ మంది మహిళా రైతులు ఉన్నారని వెల్లడించారు. ఏపీఎం టి.దధికుమార్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాలకు వడ్డీ లేని రుణాలు, పీఎంఈజీపీ రుణాలు అందించడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు అవగాహన



రైల్వే ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వికాస్‌నాయక్

కొత్తవలస: రైలు ఎక్కే సమయంలో, ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఎస్‌ఐ వికాస్ నాయక్ ప్రయాణికులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై నిర్లక్ష్యంగా నిలబడడం, పట్టాలు దాటడం, భోగీల్లో మెట్లపై నిల్చోడం, నడుస్తున్న రైలు ఎక్కడం వంటి చర్యలతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, నడుస్తున్న రైలు ఎక్కడం చేయవద్దని సూచించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ‘సంక్షేమ’ వెలుగులు



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని మీసాలపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పాలనలో పారదర్శకత కోసం ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచిపేరు ఉందన్నారు.

ఉనికి చాటుకునేందుకే లోకేష్ యాత్ర..

గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క ప్రభుత్వ పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ నెల 27వ తేదీ నుంచి టీడీపీ నేత, మాజీ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రతో ఒరిగేదేమీ లేదన్నారు. తమ పార్టీ ఉనికి కోసం యాత్ర చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన పార్టీల దొంగ నాటకాలు ప్రజలకు బాగా తెలుసని, వచ్చే ఎన్నికల్లో వారే ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. అంతకుముందు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, మండల నాయకులు లెంక రత్నాకర్, రెడ్డి రాజప్పలనాయుడు, తాడ్డి రామచంద్రరావు, సర్పంచ్ మహంతి రామునాయుడు, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- పార్టీ పట్టణ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలిస్తున్న ఒక్క వైఎస్సార్ సీపీకే ఓట్లు అడిగే హక్కు ఉందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని, ఆయన పాలనా కాలం ఓ సువర్ణయుగంలా నిలుస్తుందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన పథకాలు అందిస్తున్న తీరు, దీని కోసం ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో దాదాపు 98 శాతం హామీలు అమలు చేయడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని జోష్యం చెప్పారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ సీట్లు వైఎస్సార్ సీపీవేనని, తాను కూడా ఎమ్మెల్యేగా గెలుస్తానని అన్నారు. ఇదే మాట గతంలో తాను చాలాసార్లు చెప్పానని, అయితే టీడీపీ నేత బేబీ నాయనా మాత్రం తనపేరు సంభోదించకుండా ఇక్కడ ఎవరో గెలుస్తానని పదేపదే చెప్పుకుంటున్నారని అన్నారని, నా పేరు కూడా పలికే ధైర్యం లేదా అని బేబీ నాయనను ప్రశ్నించారు. మీకు కోటలు ఉన్నంత మాత్రాన మీ మాటలు పడాల్సిన కర్మ మా కార్యకర్తలకు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు బొబ్బిలిలో తన గెలుపుతోనే ప్రారంభమవుతుందన్నారు. కొత్తగా నియమితులైన జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు)ను ఎమ్మెల్యే సన్మానించారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, పట్టణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాల నాయుడు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు బి.శ్రీనివాసరావు, పార్వతి, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, వైఎస్సార్ సీపీ యువ నాయకులు శంబంగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, కొత్తగా నియమితులవుతున్న గృహసారథులు, కన్వీనర్లంతా సమష్టిగా పనిచేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అయితే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా కలిసి ప్రభుత్వం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. మన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఇలా చేస్తే వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో 175కి 175 పార్టీ గెలవడం సాధ్యమన్నారు. ఇప్పటి నుంచే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ బొమ్మినాయిని శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

బొబ్బిలి: వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవీ కాలం పొడిగించిన నేపథ్యంలో బొబ్బిలికి చెందిన పలువురు చైర్మన్లు, డైరెక్టర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడును ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎం జగనన్న తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పక్కి రామకృష్ణ, కింతలి శ్రీనివాసరావు, కోట పెదరాములు, సీతాదేవి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆమదాలవలసలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

రేగిడి: మండలంలోని ఆమదాలవలస కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని వారు కోరారు.

శరవేగంగా జలజీవన్ మిషన్ పనులు

రేగిడి: మండలంలోని కె.వెంకటాపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం ఈ పనులను పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో దాదాపు రూ.9.60 లక్షల వ్యయంతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ కింజరాపు సురేష్‌కుమార్ ఉన్నారు.

సేవాభావం అలవరచుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవరచుకోవాలని ఆధ్యాత్మిక వక్తలు గొర్లె దామోదరరావు, గోవిందరాజు, మోహన్‌దాస్ అన్నారు. ఆదివారం మండలంలోని దేవుదల గ్రామంలోని గీతాశ్రమంలో నిర్వహించిన గీతా దివ్య జ్ఞాన బోధ సభలో పాల్గొన్న వారు భగవద్గీత పఠనం చేస్తే జ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. భగవంతుడిని తెలుసుకునేందుకు జ్ఞాన మార్గం సహకరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ గురువుల అడుగుజాడల్లో నడవాలని తెలిపారు.

ఎమ్మెల్యే అభినందన

బొబ్బిలి రూరల్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్‌గా నియమితులైన తమ్మిరెడ్డి దామోదరరావును ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ఆదివారం అభినందించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: మండల కేంద్రంలో మెంటాడ రోడ్డు జంక్షన్, వెంకటగాయత్రీ రోడ్డు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు, మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: ప్లాస్టిక్ నిషేధానికి అంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు కోరారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ నెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలులోకి రానుందన్నారు. ఈ నేపథ్యంలో షాపు యజమానులు, కిరాణా, చిరు వ్యాపారులు, షాపింగ్ కాంప్లెక్స్, వస్త్ర వ్యాపారులు సింగిల్ యూజ్ పాలిథిన్‌ను వినియోగించవద్దని సూచించారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, ప్లాస్టిక్ స్ట్రాలు, బెలూన్ స్ట్రాలు, ప్లాస్టిక్ జెండాలు, ప్లాస్టిక్ సంచులు, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ స్పూన్లు, థర్మాకోల్ షీట్లు, ప్లాస్టిక్ గ్లాసులు నిషేధిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు ప్లాస్టిక్ బ్యానర్లు కూడా నిషేధించామన్నారు. నిబంధనలు అతిక్రమించిన పెద్దషాపులకు రూ.20 వేలు, చిన్న షాపులకు రూ.2,500 అపరాధ రుసుం విధించడంతో పాటు షాపులను సీజ్ చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలి



పంచాయతీల అభివృద్ధిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రతీ పంచాయతీ అభివృద్ధికి ఆయా పంచాయతీల్లో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు పాటుపడాలని ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. ఆదివారం స్థానిక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అంతకాపల్లి పంచాయతీ ప్రజలు, ప్రజా ప్రతినిధులతో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి తనవంతు సాయమందిస్తామన్నారు. అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడుకు సూచించారు. అనంతరం గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న శివాలయ ప్రతిష్ఠపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొరోతు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



రాజాం సిటీ: ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

రామభద్రపురం: ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని ఎస్‌ఐ బి.సురేంద్ర నాయుడు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన ఆటో డ్రైవర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. వాహనాలు నడపడంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. మద్యం సేవించి, వాహనాలను నడపవద్దన్నారు.

వంగర: మండల కేంద్రంతో పాటు వంగర గ్రామంలో రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



వంగర: ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు



రామభద్రపురం: ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేంద్రనాయుడు

రాజాం సిటీ: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపవద్దన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం



ఇంటింటి కుళాయి నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



సంతకవిటి: జలజీవన్ మిషన్ పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

వంగర: గ్రామాల్లోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండలంలోని కొట్టిశ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద మంజూరైన దాదాపు రూ.18 లక్షల వ్యయంతో ఇంటింటి కుళాయి నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులకు భూమిపూజ

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ప్రతీ ఇంటికి తాగునీటిని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సచివాలయాల మండల కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాగోలు పద్మజ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కంబాల జోగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక సూర్యదుర్గ కల్యాణ మండపంలో ఈ నెల 24వ తేదీన జరగనున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. పార్టీ స్థితిగతులు, లోటుపాట్లు, ఇబ్బందులు, విజయాలు తదితర అంశాలపై మాట్లాడడం జరుగుతుందన్నారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలకు ఈ సమావేశంలో మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులంతా సమావేశానికి హాజరై, నియోజకవర్గ పార్టీ సత్తా నిరూపించాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



జగన్నాథం కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ నాయకులు

వంగర: మండలంలోని చంద్రంపేట గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మడక జగన్నాథం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు యలకల అన్నంనాయుడు, సర్పంచ్‌లు చందక తాతబాబు, వేమిరెడ్డి సూర్యనారాయణ, బెజ్జిపురం విజయ్‌కుమార్, కనగల పారినాయుడు, కాబోతుల శ్రీనువాసునాయుడు, బెవర నూకంనాయుడు, నల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



పొలంబడి కార్యక్రమంలో అధికారులు, రైతులు

రేగిడి: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద అన్నారు. ఆదివారం మండలంలోని చాటాయవలస గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అక్కడి రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు పట్టే చీడపీడల నివారణకు సూచనలు, సలహాలు చేశారు. పంటకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగిస్తే పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో తయారు చేసే జీవామృతం పంటలకు వినియోగించాలని, ఇలా చేస్తే అధిక దిగుబడితో పాటు ఆరోగ్యవంతమైన పంట చేతికందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాల సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వారాల సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పారాది గ్రామంలో దేశమ్మతల్లికి గ్రామస్తులు పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 26వ తేదీన నూకాలమ్మ వారాలు, ఈ నెల 27వ తేదీన బంగారమ్మ వారాలు నిర్వహిస్తామని పారాది గ్రామాభివృద్ధి కమిటీ, ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.



దేశమ్మతల్లికి మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్న భక్తులు